క్లుప్తంగా

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి



ఎన్నికల విధులను వివరిస్తున్న డీసీపీ సత్తిబాబు

గోపాలపట్నం: ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో పోలీసులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని డీసీపీ–2 సత్తిబాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం జోన్–2 పరిధిలో ఉన్న స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహించాల్సిన విధులు, తీసుకోవలసిన చర్యలను వివరించారు. కోడ్ నిబంధనలను అతిక్రమించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సౌత్ హార్బర్ పరిధి ఏసీపీలు సీఐలు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే



ఇందిరాకాలనీ అంగన్‌వాడీ సెంటర్ వద్ద సర్వే చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మల్కాపురం : మురికివాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జాతీయ సేవ పథం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఆధ్వర్యంలో 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ, బర్మాకాలనీల్లో విద్య, వైద్యం, రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యాలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సర్వే చేపట్టారు.

నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సూర్యనారాయణ

గోపాలపట్నం: అపరిచిత వ్యక్తుల సంచారం, దొంగతనాలపై గోపాలపట్నం లక్ష్మీనరసింహ అపార్ట్‌మెంట్‌వాసులకు పోలీసులు అవగాహన కల్పించారు. గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ సూర్యనారాయణ మాట్లాడుతూ నేరాలు జరిగిన తరువాత కంటే అవి జరగకుండా అప్రమత్తంగా ఉండడం మేలని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజల సహకారం కావాలన్నారు. ముఖ్యంగా బయటకు వెళ్లేటప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విలువైన ఆభరణాలు వేసుకొని వెళ్లవద్దని సూచించారు. చైన్ స్నాచర్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పూర్తి వివరాలు తెలియకుండా ఎవరికీ ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, ఏఎస్ఐ ఎస్.గోవిందమ్మ, హెచ్‌సీ గణేష్ పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ నూతన కమిటీ ఎన్నిక



టీఎన్‌టీయుసీ నూతన కమిటీతో ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: హిందుస్తాన షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక కల్యాణమండపం వద్ద సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నిక నిర్వహించారు. షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడిగా మాడిసి రమణమూర్తియాదవ్, అధ్యక్షుడిగా ఉరుకూటి మురళియాదవ్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.రాము, కోశాధికారిగా ఎం.మహేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కె.ఆదిబాబులతో పాటు పలువురు పాలక సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిటీని ఎమ్మెల్యే గణబాబు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్‌లు అభినందించారు.

‘పశ్చిమ’ను అగ్రస్థానంలో నిలబెడతా



మల్కాపురంలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్



ఆనంద్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఆదరించండి అండగా నిలుస్తా
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : పశ్చిమ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడతానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అందుకు ఈ ఎన్నికల్లో మీరంతా ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మల్కాపురం పరిధిలో పలు వీధుల్లో పర్యటించారు. నియోజవకర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన తరువాత సుమారు రూ.30 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టానని గుర్తు చేశారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ సారథ్యంలో నిర్వహించిన ప్రచారంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. ముందుగా మల్కాపురం గ్రామదేవత మరడిమాంబ అమ్మవారికి ఆనంద్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లివీధి, గొల్లవీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో టీడీపీ నేత గణబాబును గెలిపించారని, విజయం సాధించిన ఆయన నియోజకవర్గాన్ని పట్టించుకోవడమే మానేశాడన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఎలా ఉన్నారో కూడా ఆలోచన చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడైనా సమస్యలు పరిష్కరించారా అని ప్రజలను ప్రశ్నించారు. తనకు పదవి లేకపోయినా ప్రజల కష్టాలను, సమస్యలను తెలుసుకుని అండగా నిలిచానన్నారు. సొంత నిధులతో పింఛను అందించానని, ప్రజల ఆరోగ్య సమస్యలపై స్పందించానని, ఇళ్లు లేని వారికి ప్రభుత్వ పరంగా వచ్చే ఏర్పాటు చేశానని వివరించారు. వందలాది మందికి ఇళ్ల పట్టాలను ఇప్పించానని గుర్తు చేశారు. అంతేకాక పారిశ్రామిక ప్రాంతంలో ఏడు వార్డుల పరిధిలో సుమారు రూ.20 కోట్ల మేర వివిధ అభివృద్ధి పనులను చేపట్టానని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తూ అనేక సంక్షేమ పథకాలతో భరోసా కల్పించారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి భద్రినాథ్, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, ఎం.అప్పారావు, ధనలత, నూకరెడ్డి, బూసఅప్పలరెడ్డి, చట్టి నూకరాజు, జీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఆడారి ఆనంద్

గోపాలపట్నం: పార్టీ అభివృద్ధికి, ఆర్యవైశ్యుల అభ్యున్నతి కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఇటీవల 91 వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. పదవి వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ ద్వారా పేదల బాగు కోసం పని చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరవు ఆధ్వర్యంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరెడ్డి, కంపర సత్తిబాబు, బురెడ్డి గోపి పాల్గొన్నారు.

వీటికి కోడ్ వర్తించదా..?

ఎన్ఏడీలో టీడీపీ ఫ్లెక్సీలు, పోస్టర్లు



గవర వీధిలో తొలగించని గణబాబు ప్రచార పోస్టరు



90వ వార్డు గవర వీధిలో తొలగించని టీడీపీ ఫ్లెక్సీ

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల నియామళి అమలు చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో పలు చోట టీడీపీ ఫ్లెక్సీలు, ఎమ్మెల్యే గణబాబుకు సంబంధించిన ప్రచార పోస్టర్లు ఎక్కడ బడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ఇవి పూర్తిగా తొలగించాలి. ఎన్ఏడీ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఉన్న ఫలంగా ముసుగు తొడిగి, అక్కడ ఉన్న వైఎస్సార్ సీపీకు సంబంధించిన ఫ్లెక్సీలన్నీ తొలగించిన అధికారులు, వార్డు పరిధిలోని వీధుల్లో ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు, పోస్టర్లను మాత్రం అలానే వదిలేశారు. టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలుస్తున్న ఎమ్మెల్యే గణబాబు తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు అంటూ ముద్రించిన పోస్టర్లు ఇష్టానుసారంగా గోడలకు అతికించారు. వీటిని వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆడారి ఆనంద్ గెలుపు కోసం ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మల్కాపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని, పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవాలని యువకులు నినదించారు. ఆదివారం పారిశ్రామిక ప్రాంతంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మల్కాపురం మరిడిమాంబ ఆలయంలో పూజలు చేసిన అభిమానులు..ఆనంద్‌కుమార్‌పై దుష్టశక్తుల కుయుక్తులు పని చేయకుండా చూడాలమ్మ అంటు అమ్మవారిని మొక్కుకున్నారు. అనంతరం వారంతా ఆలయం నుంచి మల్కాపురం, ఆర్‌కే పురం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు

మల్కాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు విజయం చేకూర్చాలని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీవీఎంసీ 60వ వార్డు బర్మాకాలనీ వద్ద గల చర్చిలో ఆదివారం ఉదయం స్థానిక నాయకుడు బిల్డర్ శ్రీను ఆధ్వర్యంలో చర్చి పాస్టర్ బాలు ప్రార్థనలు చేశారు. ఆడారి ఆనంద్‌కుమార్‌కు అంతా మద్దతు పలకాలని క్రైస్తవులను ఆయన కోరారు.

సంక్షేమాన్ని చూసి ఓటెయ్యండి

సింధియా : ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ మళ్లీ ఓటు వేసి గెలిపించాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కోరారు. ఆదివారం సాయంత్రం 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీలో లక్ష్మణరావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మోజారిటితో గెలిపించాలని కోరారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్సా ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎల్ నాయుడు, సత్యనారాయణ, క్రిష్ణ, మసేనమ్మ, పరశురామ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఫీజు కడితేనే హాల్ టికెట్

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఫీజు బకాయిలు పేరిట పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రోజు విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురిచేయగా.. ఇదేం పని ‘నారాయణ’ అంటూ తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం స్కూల్‌కు వెళ్లినా, ఫీజు కడితేనే హాల్ టికెట్ ఇస్తామంటూ ఆ పాఠశాల నిర్వాహకులు చెప్పటంతో విద్యార్థి తండ్రి ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. ఫీజుబకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులందిరికీ హాల్ టికెట్లు ఇవ్వాల్సిందేనని డీఈవో చంద్రకళ ఆదేశించినా, ఎన్ఏడీలోని సదరు కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావును వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి, నిజమైతే సదరు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

అదుపులో సెల్‌ఫోన్ దొంగ



యువకుడ్ని స్టేషన్‌కు తరలిస్తున్న కానిస్టేబుల్

విశాఖ విద్య: ఎన్ఏడీ మర్రిపాలెం రైతు బజార్‌లో ఆదివారం ఓ యువకుడు సెల్‌ఫోన్ చోరీకి ప్రయత్నించాడు. రైతు బజార్‌కు కూరగాయలు కొనుగోలుకు వచ్చిన ఓ వినియోగదారుడి జేబులోంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేసేందుకు యత్నించాడు. దీన్ని గమనించిన సదరు వినియోగదారులు వెంటనే అతన్ని పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రైతు బజార్ ఈవో కొమ్మునాపల్లి వరహాలు అక్కడికి చేరుకొని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుబజార్‌కు చేరుకున్న పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని, స్టేషన్‌కు తరలించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్, తదితరులు ఈ పూజ చేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ఆర్పీ పేట హైస్కూల్‌లో సిద్ధమైన తరగతి గది



కప్పరాడ పాఠశాలలో టేబుల్‌పై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గోపాలపట్నం మండల పరిధిలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో అంబటి సోమేశ్వరరావు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. మండల పరిధిలోకి వచ్చే మధవధార, గోపాలపట్నం, ఎన్ఏడీ తదితర ఏరియాల్లో గల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో 240 మంది వరకు విద్యార్థులకు సీటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్య సిబ్బందికి విధులకు కేటాయించామన్నారు. పరీక్షల్లో ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో ఎలాంటి సమస్య ఉన్నా, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చీఫ్ సూపరింటిండెంట్, డిపార్టమెంట్ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు, ఇన్విజిలేషన్ సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు తీసుకురాకూడదన్నారు. విద్యార్థులను కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన మీదటే లోపలికి పంపించాలన్నారు. అంతా సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలన్నారు.



ఐటీఐ కూడలిలోని కప్పరాడ సెంటర్

అరగంట ముందే చేరుకోవాలి

కంచరపాలెం: కంచరపాలెం, ఐటీఐ కూడలి పరిధి రామ్మూర్తిపంతులుపేట, కప్పరాడ, భాష్యం, శ్రీచైతన్య, రామకృష్ణ ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, డీవోలు తెలిపారు. తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులు నిబంధనలు, సమయపాలన పాటించాలని అధికారులు కోరారు. పరీక్ష సమయం కంటే అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులు రెడీ..

జ్ఞానాపురంలోని సేక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఐటీఐ కూడలిలోని కప్పరాడ ఉన్నత పాఠశాల, కరాసలోని స్టెల్లామేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎన్ఏడీ కొత్తరోడ్డులోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్, ఎన్ఏడీ శ్రీచైతన్య స్కూల్, ఆర్పీ పేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కప్పరాడ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని హెచ్‌ఎంలు ఆర్.శ్రీనివాసరావు, వి.విజయమాలిని తెలిపారు.

సీపీఎం నేత అప్పలస్వామికి ఘన నివాళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నేత జగ్గునాయుడు

సింధియా : జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో కామ్రేడ్ తియ్యాల అప్పలస్వామి సంస్మరణ సభను సీపీఎం నాయకులు ఆదివారం నిర్వహించారు. దుర్గానగర్ సీపీఎం కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంస్మరణ సభకు సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, సీనియర్ నాయకులు యూవీఎస్ఎన్ వర్మ ముఖ్య అతథులుగా హాజరై స్వర్గీయ అప్పలస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ అప్పలస్వామి కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు కట్టుబడి చివరి వరకు ప్రజాసమస్యలపైనే పోరాడారన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, ఐద్వా రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

గోపాలపట్నం : భగత్‌సింగ్ నగర్‌లో శివాలయం విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు దొడ్డి కిరణ్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

భీమిలిలో గెలుపు వైఎస్సార్‌సీపీదే..



చంద్రనగర్‌లో నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం చంద్రనగర్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. భీమిలి నుంచి మళ్లీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పోటీ చేస్తుండడంతో కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. భీమిలిలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని నినదించారు. ముత్తంశెట్టి జిందాబాద్ అంటూ హోరెత్తించారు. కార్యక్రమంలో 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, కార్యకర్తలు హరి, రవి, బాబ్జి, రాము, సంతోష్, చిన్నారావు, సాయిరామ్, యర్రమ్మ, విజయ్ పాల్గొన్నారు.

రహదారి విస్తరణ కుదించాలి



బెహరా భాస్కరరావుకు వినతిపత్రం అందిస్తున్న రహదారి విస్తరణ బాధితులు

గోపాలపట్నం: గోపాలపట్నం కుమారి కల్యాణ మండపం నుంచి ఎన్ఎస్‌టీఎల్ రహదారి వరకు 80 అడుగుల రహదారి విస్తరణను 40 అడుగులకు కుదించాలని బాధితులు కొందరు జీవీఎంసీ కోఆప్షన సభ్యుడు బెహరా భాస్కరరావును కోరారు. విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం తక్షణం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. స్థలం, ఇళ్లు కోల్పోయిన వారికి నాలుగు రెట్లు విలువగల టీడీఆర్‌లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పాక్షికంగా ఇల్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారంతో పాటు పునఃనిర్మాణ సమయంలో దేవస్థానం అధికారులు ఇబ్బందులు పెట్టకుండా చూడాలన్నారు. ఈమేరకు వినతి పత్రాన్ని బెహరా భాస్కరరావుకు అందించారు. ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. దుర్గేష్, ఉమా మహేశ్వరరావు, రమేష్, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

లౌకిక వామపక్ష శక్తులు ఏకం కావాలి

కంచరపాలెం: మనువాద హిందూ ఫాసిస్ట్ శక్తులను ఓడించడానికి లౌకిక వామపక్ష శక్తులు ఏకం కావాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. ఐటీఐ కూడలి కాయిత పైడయ్య కల్యాణమండపంలో భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సీఐటీయూ నాయకుడు కామ్రేడ్ సీహెచ్ ఎఫ్ లాజరస్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవాలంటే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమాజం జిల్లా అధ్యక్షుడు వై నూకరాజు, డాక్టర్ జయగోపాల్, బి.సత్యానందరావు, రెడ్డిపల్లి బాబూ రావు, పట్నాయక్, జె రవి, సునీత, అజయ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమిస్తే విజయం



టెన్త్ విద్యార్థులతో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. కంచరపాలెం గౌరీనగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టెన్త్ విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తుకు మంచి పునాది పదో తరగతని చెప్పారు. టెన్త్ పరీక్షల్లో 10/10 మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి ప్రోత్సాహకాన్ని అందిస్తానన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థుల పరీక్ష సామగ్రిని సతీష్ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, నమ్మి జ్యోతేష్ పాల్గొన్నారు.